# అసెంబ్లీలో మీడియా నియంత్రణ సరి కాదు

## బీఏసీలో చర్చించాలి • తెదేపా డిమాండ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: అసెంబ్లీలో మీడియాపై నియంత్రణ విధించడం సరి కాదని తెలుగుదేశం పార్టీ పేర్కొంది. శాసనసభావ్యవహారాల కమిటీ(బీఏసీ)లో చర్చించాకే దీనిపై నిర్ణయం తీసుకోవాలని కోరింది. దీనిపై స్పీకర్ మరోసారి ఆలోచించాలని విజ్ఞప్తి చేసింది. ప్రజా సమస్యలపై పార్టీలు సభలో స్పందించే తీరు, సభ్యుల ప్రవర్తనను ప్రజలందరూ చూడాల్సిన అవసరముందని తెలిపింది. మంగళవారం పార్టీ సీనియర్ నేత కె.ఎర్రన్నాయుడు, ఎమ్మెల్యేలు రావుల చంద్రశేఖరరెడ్డి, మోత్కుపల్లి నరసింహులు విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్ష ప్రసారం చేయాలనే నిర్ణయాన్ని తెదేపా హయాంలో తీసుకున్నట్లు రావుల తెలిపారు. దీన్ని దేశమంతా అనుకరిస్తుంటే, ఇప్పుడు ఇలాంటి నిర్ణయాలు రాష్ట్రాన్ని వెనక్కు తీసుకువెళతాయని పేర్కొన్నారు. అసెంబ్లీలోకి మీడియాని అనుమతించవద్దని స్పీకర్ నిర్ణయం తీసుకొని ఉంటే దాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. లేకుంటే అలాంటి నిర్ణయం తీసుకోరాదని కోరారు.

# రామారావుపై కేసు రద్దుచేయాలి

## ఎమ్మెల్సీ నన్నపనేని డిమాండ్



హైదరాబాద్, న్యూస్‌టుడే: కొవ్వూరు శాసనసభ్యుడు టి.వి.రామారావు విషయంలో లేనిది ఉన్నట్లుగా చూపేందుకు ప్రభుత్వం అత్యుత్సాహం చూపుతోందని తెదేపా ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి విమర్శించారు. తప్పుడు కేసులను ప్రోత్సహించవద్దని ముఖ్యమంత్రిని హెచ్చరించారు. మంగళవారం ఎన్టీఆర్ భవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. భయపెట్టో, ప్రలోభపెట్టో కేరళ నుంచి విద్యార్థినులను తీసుకొచ్చి రామారావుపై నిందలు మోపుతున్నారని ఆరోపించారు. ఆ అమ్మాయిల జీవితాలతో ఎందుకు ఆడుకుంటున్నారని ప్రశ్నించారు. విజయనగరంలో మంత్రి దగ్గరి వ్యక్తి గణపతి యాసిడ్ పోస్తానని బెదిరిస్తున్నాడని లక్ష్మి అనే బాధితురాలు ఫిర్యాదు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. వెంటనే గణపతిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అయేషామీరా హత్యకేసులో ఓ మంత్రి మనవడి ప్రమేయం ఉందని ఆరోపణలు రావడంతో ప్రభుత్వం పనిగట్టుకుని ఆ కేసును నీరుగార్చిందని ధ్వజమెత్తారు. హోంమంత్రి నియోజకవర్గంలో ఓ యువతిపై గొడ్డలితో దాడి చేస్తే.. హోంమంత్రి కనీసం వెళ్లి ఆమెను పలకరించలేదని పేర్కొన్నారు. ఇన్ని కేసులను పట్టించుకోని ప్రభుత్వం ఏమీ జరగకున్నా ఓ దళిత ఎమ్మెల్యేను వేధింపులకు గురి చేస్తోందని దుయ్యబట్టారు. రామారావుపై పెట్టిన నిరాధారమైన కేసును వెంటనే ఎత్తివేయాలని, ఆయనకు బేషరతు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.